# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th HAPPY ANNIVERSARY

9 సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 300 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | సోమవారం 8 జూలై 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## నా జీవితంలో మరువలేను

### ఆ మూడు ఘట్టాలు నాకెంతో కీలకం



- టీపీసీసీ చీఫ్ గా మూడు వసంతాలు పూర్తి
- సోనియాగాంధీ, కాంగ్రెస్ అగ్రనేతలందరికీ కృతజ్ఞతలు
- పార్టీ అధికారంలోకి రావడానికి
- లక్షలాది మంది కార్యకర్తల కఠోర శ్రమ
- నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు
- సీఎం రేవంత్రెడ్డి ఆసక్తికర ట్వీట్

**హైదరాబాద్ పెన్ పవర్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర ట్వీట్ చేశారు. నేటితో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాద్యతలు స్వీకరించి మూడు వసంతాలు పూర్తయ్యాయని చెప్పారు. నాడు తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన సోనియా గాంధీ..కాంగ్రెస్ అగ్రనేతలందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇదే విషయంపై ట్విట్టర్ లోఆసక్తికర ఫొటో షేర్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం.. సోనియా గాంధీ సారథ్యంలో విజయభేరి నిర్వహించడం, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం మూడేండ్లలో ఈ మూడు ఘట్టలు జీవితంలో మరువలేనివన్నారు. ఈ ప్రస్తానంలో తనకు సహకరించిన పార్టీ సీనియర్ నేతలు, కఠోర శ్రమ చేసిన లక్షలాది మంది కార్యకర్తలు, నాలుగు కోట్ల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.





- ప్రపంచ ప్రసిద్ధి చెందిన పూరీ జగన్నాథ రథయాత్ర
- 1971 తర్వాత తొలిసారిగా నేడు ఒకేసారి మూడు వేడుకలు
- తొలిసారి ఓ భారత రాష్ట్రపతి హాజరు

## అత్యంత ఘనంగా పూరీ జగన్నాథుడి రథోత్సవం...

### రథం లాగిన రాష్ట్రపతి ముర్ము

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ ప్రసిద్ధి చెందిన పూరీ జగన్నాథ రథయాత్ర అత్యంత ఘనంగా ప్రారంభమైంది. ఒడిశాలోని పూరీ పుణ్యక్షేత్రం నేడు ఇసుకేస్తే రాలనంతగా భక్తులతో క్రిక్కిరిసిపోయింది. పూరీ క్షేత్రంలో నేడు ఒకేసారి మూడు వేడుకలు చేపట్టడంతో దేశం నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. 1971 తర్వాత తొలిసారిగా

వివరాలు 2లో..



## తెలంగాణ గ్రూప్ -1 ప్రిలిమ్స్ ఫలితాలు రిలీజ్

**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రూప్ -1 ప్రిలిమ్స్ ఫలితాలు రిలీజ్ చేసిం ది టీజీపీఎస్సీ. 1:50 నిష్పత్తిలో మెయిన్స్ కు అభ్యర్థులను ఎంపిక చేసినట్లు వెల్లడిం చింది. అక్టోబర్ 21వ తేదీ నుంచి 27వం కు మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించింది. పరీక్షకు వారం రోజుల ముందు హాల్ టికెట్లు విడుదల చేస్తామం ది. ప్రిలిమినరీ మార్కుల కటాఫ్ ను వెబ్ సైట్ లో అందుబాటులో

వివరాలు 2లో..

# రెండు రాష్ట్రాలు నాకు రెండు కళ్లు

### రెండు ప్రాంతాల అభివృద్ధే టీడీపీ లక్ష్యం

### యుగపురుషుడు ఎన్టీఆర్ ఇదే గడ్డపై టీడీపీని స్థాపించారు

### అధికారం పోయి 20 ఏళ్లు.. అయినా మీ ఉత్సాహం తగ్గలేదు

### తెలుగుజాతి ఉన్నంత వరకూ పసుపు జెండా ఎగురుతుందన్న ఏపీ సీఎం



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ గడ్డపై తెలుగుదేశం పార్టీకి పునర్వైభవం వస్తుందని ఈరోజు ఇక్కడికి వచ్చిన మిమ్మల్ని చూస్తుంటే తెలుస్తోందని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తెలంగాణలో టీడీపీ అధికారానికి దూరమై 20 ఏళ్లు గడిచినా పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం తగ్గకపోగా, రోజురోజుకూ పెరుగుతోందని చెప్పారు. తెలుగు రాష్ట్రాలు తనకు రెండు కళ్లు అని చంద్రబాబు మరోసారి ఉద్ఘాటించారు. ఈమేరకు నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి హైదరాబాద్ వచ్చిన చంద్రబాబు.. ఆదివారం ఉదయం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు వచ్చారు. ఏపీ సీఎం చంద్రబాబును టీడీపీ తెలంగాణ నేతలు ఘనంగా సన్మానించారు. అనంతరం టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీని యుగపురుషుడు ఎన్టీఆర్ ఇదే గడ్డపై, ఇక్కడే ఎమ్మెల్యే కాలనీలో ప్రారంభించారని గుర్తుచేశారు. తెలుగు వాడి ఆత్మగౌరవాన్ని చాటిచెప్పేందుకు టీడీపీ పుట్టుకొచ్చిందని, ప్రపంచంలో తెలుగు జాతి ఉన్నంత కాలం తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడుతుందని చంద్రబాబు చెప్పారు. తెలుగుజాతికి గౌరవం తీసుకొచ్చిన వ్యక్తి ఎన్టీఆర్.. తెలుగువాళ్లను మదరాసీ అని పిలుస్తుంటే కాదు తెలుగుజాతి అనేది ఒకటుందని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని చంద్రబాబు కొనియాడారు. కరణం, మునసబు, పటేల్ పట్వారీ వ్యవస్థతో తెలంగాణ ప్రాంత ప్రజలు పడుతున్న కష్టాలను ఎన్టీఆర్ తొలగించారని గుర్తుచేశారు.

ఆ వ్యవస్థలను ఎన్టీఆర్ రద్దు చేయడంతో మాకు స్వాతంత్ర్యం వచ్చిందని ఇక్కడి ప్రజలు సంబరాలు చేసుకున్నారని చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో రెండు రాష్ట్రాలు సమాంతరంగా అభివృద్ధి చెందాలని, ఏ ప్రాంతంవైపు మొగ్గుచూపబోనని తాను చెప్పానన్నారు. రెండు ప్రాంతాల ప్రయోజనాల కోసం ఆలోచించి పనిచేసే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని చెప్పారు. తెలుగుజాతి ఐకమత్యంతో ఉండాలని కోరుకుంటా, కలిసిమెలిసి ఉండాలనే నా చివరి రక్తపుబొట్టు వరకు ఆలోచిస్తానని చంద్రబాబు పేర్కొన్నారు.



## డ్రగ్స్ తీసుకుంటే కఠిన చర్యలు తప్పవు

### మాదాపూర్ డీసీపీ

**హైదరాబాద్ పెన్ పవర్:** మాదాపూర్ లోని రాయదుర్గం ది కేవ్ పబ్ కేసులో కీలక విషయాలు వెల్లడించారు మాదాపూర్ డీసీపీ. డ్రగ్స్ కేసులో పట్టుబడిన వారిలో మొత్తం 24 మందికి పాజిటివ్ అని తేలింది. వీరిలో

వివరాలు 2లో..

### అధ్యక్ష బరిలో ఉండేది నేనే..

## గెలిచేదీ నేనే

### అమెరికా అధ్యక్ష ఎన్నికలపై మరోసారి క్లారిటీ ఇచ్చిన ప్రెసిడెంట్

### తాను పూర్తి ఆరోగ్యంగానే ఉన్నానని, ఏ పరీక్షలూ అవసరంలేదని వ్యాఖ్య

### అధ్యక్ష పదవికి తనకంటే అర్హులు ఎవరూ లేరన్న బైడెన్



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా అధ్యక్ష బరిలో నుంచి తప్పుకునేదే లేదని ప్రస్తుత ప్రెసిడెంట్, డెమోక్రాట్ అభ్యర్థి జో బైడెన్ స్పష్టం చేశారు. అధ్యక్షుడిగా తనకంటే మెరుగైన అభ్యర్థి ఎవరూ

వివరాలు 2లో..

### పుట్టింది బతకడానికే కానీ..

## చావడానికి కాదు



**హైదరాబాద్ పెన్ పవర్:** పుట్టింది బతకడానికే కానీ..చావడానికి కాదన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో

వివరాలు 2లో..

## సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ

- విద్యా మంత్రిత్వ శాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి
- రేవంత్ సర్కారు విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందంటూ హరీశ్ రావు విమర్శలు
- కేసీఆర్ విద్యా వ్యవస్థ పటిష్టానికి అనేక చర్యలు తీసుకున్నారని వెల్లడి
- కాంగ్రెస్ పాలన విద్యా వ్యవస్థకు శాపంలా మారిందని ఆవేదన



వివరాలు 2లో..

## ఆషాఢం జాతర మొదలైంది.. గోల్కొండ జగదాంబికకు తొలి బోనం

శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు.. ఘటాలు, ఫలహార బండ్ల ఊరేగింపులు.. నెత్తిన బోనం పెట్టుకుని తరలివచ్చే మహిళలతో బోనాల పండగ అంగరంగవైభవంగా జరుగుతుంది. తొలి బోనం సమర్పించే గోల్కొండలో బోనాల పండుగ కోలాహలం మొదలైంది. గోల్కొండ కోటలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.



వివరాలు 2లో..

## సంపాదకీయం

# జుట్టు రాలిపోతుందా.. అయితే ఉసిరిని ఇలా ఉపయోగించండి...

పూర్వకాలంలో అరవై ఏళ్లలో కూడా జుట్టు నల్లగా నిగ నిగలాడుతూ ఉండేది. అయితే ప్రస్తుత కాలంలో ఆరేళ్లకే జుట్టు ఊడిపోవడం.. తెల్ల జుట్టు రావడంతోయూత్? చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికి జుట్టు రాలడం అనేది ప్రధాన సమస్య. దీనికి కారణం... జీవన శైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు, అనారోగ్య సమస్యల కారణంగా జుట్టు సంబంధిత సమస్యలు ఎక్కువయ్యాయి. అయితే ఉసిరితో జుట్టును నల్లగా..రాలిపోకుండా చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.. అవేంటో చూసేద్దాం....

ప్రస్తుత కాలంలో జుట్టు ఎక్కువగా రాలిపోవడం, చుండ్రు సమస్యలతో జనాలు బాధపడుతున్నారు. ఈ సమస్యల నుండి బయటపడేందుకు చాలా మంది మార్కెట్లో దొరికే బ్యూటీ కేర్ ప్రొడక్ట్స్ వాడుతున్నారు. కానీ వాటిని ఉపయోగించిన వలన ఫలితం ఉంటుందో లేదో తెలియదు. పైగా వాటి అనేక అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. ఇలాంటి సమస్యల నుండి బయట పడాలంటే ఉసిరి ఉపయోగిస్తే మంచి ఫలితం ఉంటుంది. ఉసిరిలో చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

ఇప్పుడున్న పరిస్థితుల్లో వయసుతో సంబంధం లేకుండా తెల్ల జుట్టు వస్తుంది. కొన్ని అనివార్య కారణాల వల్ల కూడా జుట్టు తెల్లగా మారుతుంది. ఈ సమస్య నుండి బయటపడాలంటే.. గూస్బెర్రీ పొడితో పాటు ఉసిరి పొడిని నీటిలో కలిపి జుట్టుకి అప్లై చేసి 10 నుంచి 15 నిమిషాల తర్వాత తలస్నానం చేస్తే.. మంచి ఫలితం ఉంటుంది. చుండ్రు రావడానికి ప్రధాన కారణం.. స్కాల్ప్ పొడిగా మారటమే.. ఈ సమస్య నుండి బయట పడాలంటే ఉసిరి వాడండి. ఎందుకంటే స్కాల్ప్ కి ఇది మాయిశ్చరైజర్ గా పనిచేస్తుంది. తద్వార చుండ్రు సమస్య తొలగిపోతుంది.

ఉసిరిలో విటమిన్ సి, ఫైటో న్యూట్రియంట్లు, అనేక ఖనిజాలు అధికంగా ఉంటాయి. ఉసిరిని ఉపయోగించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలతో పాటు, జుట్టు సంబంధిత సమస్యలు తొలగిపోతాయి. అలాగే జుట్టు దృఢంగా మారుతుంది. అనేక కారణాల వల్ల జుట్టు రంగుని కోల్పోతుంది. పోషకాహార లోపం, ఒత్తిడి, నిద్రలేమి సమస్య వలన జుట్టు రంగు మారుతుంది. అయితే ఉసిరిని ఇలా ఉపయోగిస్తే మంచి ఫలితం ఉంటుంది. బృంగరాజ్ నూనెలో ఆమ్లా పొడిని వేసి జుట్టుకి అప్లై చేస్తే జుట్టు రంగు మారుతుంది. అలాగే గోరింటాకుతో ఉసిరి పొడిని కలిపి జుట్టుకి అప్లై చేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇలా నెలకు రెండు సార్లు చేస్తే జుట్టు రంగు మారుతుంది. అలాగే ఒత్తుగా పెరుగుతుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

# చార్‌ధామ్ యాత్ర తాత్కాలికంగా నిలిపివేత

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరాఖండ్ లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా చార్ ధామ్ యాత్ర కొనసాగే గర్వాల్ ప్రాంతంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ఇప్పటికే ఐఎండీ ప్రకటించింది. దీంతో ఆదివారం (జూలై 7,2024) చార్ ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. జూలై 7,8 తేదీ భారీ వర్షాలుకురిసే అవకాశం ఉందని ఐఎండీ రెడ్ అలర్ట్ ప్రకటించింది. యాత్రికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని చార్ ధామ్ యాత్రను వాయిదా వేస్తున్నట్లు గర్వాల్ అధికారులు తెలిపారు. ఈ రెండు రోజులు భక్తులు రుషికేష్ దాటి చార్ ధామ్ యాత్రకు వెళ్లొద్దని సూచించారు. యాత్రకు వాతావరణ అనుకూలించే వరకు భక్తులు వేచి ఉండాలని కోరారు. గత కొన్ని రోజులుగా ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాలకు నదులు ఉప్పొంగుతున్నాయి. వరదలతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అనేక గ్రామాలు నీట మునిగాయి. రోడ్లు తెగిపోయి రవాణా నిలిచిపోయింది. వరదల్లో ఇండ్లు కొట్టుకుపోయాయి. పంటలు నీటమునిగాయి. కొండచరియలు విరిగి పడి పలువురు మృతిచెందారు. ఈ క్రమంలో మరో మూడు రోజులు ఉత్తరాఖండ్ లోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. ఈ క్రమంలో చార్ ధామ్ యాత్రకు వెళ్లే భక్తులు అప్రమత్తంగా ఉండాలని.. వాతావరణం అనుకూలించే సమయంలోనే యాత్ర కొనసాగించాలని సూచించింది.

# ఆషాఢం జాతర మొదలైంది.. గోల్కొండ జగదాంబికకు తొలి బోనం

- మొదటి పేజి తరువాయి

భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు. డప్పు చప్పుళ్లు, తీన్మార్ దరువులతో ఆ ప్రాంతమంతా మార్మోగుతోంది. పోతరాజుల వీరంగాలు, శివసత్తుల ఆటలతో జాతర శోభ సంతరించుకుంది. విశాలా బజార్ లోని గోల్కొండ పోలీస్ స్టేషన్ నుంచి మహంకాళి అమ్మవారి ఊరేగింపు ప్రారంభమయింది. బడా బజార్ అనంతచారి ఇంటి నుంచి జగదాంబిక అమ్మవారి పూజ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపును చేపడతారు. లంగర్ హౌస్ నుంచి ప్రభుత్వం తరఫున సమర్పించే పట్టు వస్త్రాలు.. తొట్టెలు పోతరాజుల ఊరేగింపుతో ప్రారంభమయింది. బంజారీ దర్వాజా నుంచి గోల్కొండ సర్కారీ బోనంఊరేగింపుగా వస్తుంది. ఇవన్నీ సాయంత్రం 4 గంటల 30 నిమిషాల నుంచి 5 గంటల మధ్య గోల్కొండ కోట గేటు దగ్గరికి చేరకుంటుంది. గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మళ్లీ గోల్కొండలోనే చివరి బోనంతో ఉత్సవాలు ముగుస్తాయి. గోల్కొండ బోనాలకు తరలివచ్చే భక్తుల కోసం కోటలో ఏర్పాట్లు చేశారు. కోట ప్రారంభం నుంచి బోనాలు సమర్పించే ప్రాంతం దాకా తాగునీటి పాయింట్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెల్లడించారు. గోల్కొండ కోట పరిసరాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.. మరోవైపు ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేకంగా హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేశారు. పండుగ జరిగే అన్ని రోజులు భక్తులకు ప్రభుత్వం కోటలోకి ఉచిత ప్రవేశం కల్పించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. జీహెచ్ఎంసీ, పోలీస్, హెల్త్, ట్రాఫిక్, ఎలక్ట్రిసిటీ అధికారులు విధుల్లో పాల్గొంటారు. గోల్కొండ కోటలో మొత్తం 20 మొబైల్ టాయిలెట్లు, ఐదు హెల్త్ క్యాంపులు, మూడు అంబులెన్సులు అందుబాటులో ఉంచారు. వృద్ధులు, వికలాంగులకు బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైయ్యే అంబులెన్స్‌ను కూడా సిద్ధంగా ఉంచారు. అగ్నిమాపక శాఖ వారు మొబైల్ ఫైర్ ఎస్టింగిషర్‌ను కూడా సిద్ధం చేశారు. పోలీసులు లంగర్‌హౌజ్ నుంచి గోల్కొండ వరకు పికెటింగ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు మహిళా పోలీస్ టీమ్‌లను కూడా సిద్ధంగా ఉంచారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు

### భక్తులకు తాగునీరు

మొత్తం తొమ్మిది పూజలు అందుకునే అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం జలమండలి భారీ ఎత్తున తాగునీటి ఏర్పాట్లు చేస్తోంది.గోల్కొండ బోనాల పండుగకు తాగునీటిని అందించేందుకు హైదరాబాద్ మహానగర నీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కోట మెట్ల నుంచి ప్రారంభమై బోనాలు వరకు వివిధ ప్రాంతాల్లో తాగునీటి పాయింట్లు ఏర్పాటు చేశారు. వంట చేసే ప్రాంతంలో ఇందుకోసం డ్రమ్ములు, సింటెక్స్ ట్యాంకులు, పంపులు, పైపులైన్లు, స్టాండ్‌లు సిద్ధం చేశారు. పైపులైన్ల ద్వారా నీటి సరఫరా చేయనున్నారు. అదనంగా, నీటి ప్యాకెట్లు మరియు గ్లాసులు అందుబాటులో ఉన్నాయి మరియు నీటి క్యాంపుల సమీపంలో టెంట్లు ఏర్పాటు చేయబడ్డాయి. ఆయా ప్రాంతాల్లో నీటి లభ్యత మేరకు నీటి సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో రాందాస్ బధిఖానా, చోటాబజార్, జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం, లంగర్‌హౌస్‌లో తాగునీటి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేసినట్లు జలమండలి సీనియర్ అధికారి తెలిపారు.

### ట్రాఫిక్ మళ్లింపు

గోల్కొండ కోట పరిసర ప్రాంతాల్లో నెల రోజుల పాటు ప్రతి ఆది, గురువారాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుంది. కోటకు వచ్చే భక్తులు రామ్ దేవ్ గూడ మక్కాయ్
దర్వాజా నుంచి వచ్చి రామ్ దేవ్ గూడలో పార్కింగ్ చేయాలని అదనపు కమిషనర్ (ట్రాఫిక్) తెలిపారు. లంగర్ హౌజ్ నుంచి గోల్కొండ కోటకు వచ్చే భక్తులు తమ వాహనాలను ఫతే దర్వాజా వద్ద పార్క్ చేయాలి. 7 టూంబ్స్ వైపు నుంచి వచ్చే వాహనాలను బంజారా దర్వాజ వద్ద ఆపాలని షేక్ పెటనాల సూచించారు. కోటలో మొత్తం 650 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. వీరిలో ఇద్దరు లా అండ్ ఆర్డర్ డీసీపీలు, ట్రాఫిక్ డీసీపీలు, ఏడుగురు ఏసీపీలు, 25 మంది సీఐలు, 55 మంది ఎస్సైలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పాటు అశ్విక దళం, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది విధుల్లో ఉంటారు.

# సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పట్టించుకోవడంలేదని విమర్శించారు. గతంలో విద్యా వ్యవస్థ పటిష్టం కోసం కేసీఆర్ అనేక చర్యలు చేపట్టారని వివరించారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు పాటుపడ్డారని తెలిపారు. కానీ, కాంగ్రెస్ సర్కారు విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో అనేక సమస్యలు ఉన్నాయని, వసతులు అంతంత మాత్రమేనని, తగినంత మంది టీచర్లు లేరని, పుస్తకాల కొరత, తాగునీటి కొరత ఉన్నాయని హరీశ్ రావు వెల్లడించారు. జీతాల చెల్లింపు ఆలస్యమవుతోంది ఆరోపించారు. విద్యాశాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ అంశాలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని హరీశ్ రావు తన లేఖలో విమర్శించారు. మీరు అధికారంలోకి వచ్చి ఏడు నెలలయింది... కొత్తగా మీరు చేసిందేమీ

లేకపోయినా, గత ప్రభుత్వం చేసిన వాటిని కొనసాగిస్తే బాగుండేది అని హితవు పలికారు. కాంగ్రెస్ సర్కారు పాలన తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, ప్రభుత్వ పాఠశాలలకు శాపంలా మారిందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.మధ్యాహ్న భోజన పథకం హెల్పర్లకు పెండింగ్ జీతాలు ఇవ్వాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 9 వేల ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని స్పష్టం చేశారు.

# పుట్టింది బతకడానికే కానీ.. చావడానికి కాదు

- మొదటి పేజి తరువాయి

ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు భోజడ్ల ప్రభాకర్ కుటుంబాన్ని భట్టి విక్రమార్క పరామర్శించారు. ప్రభాకర్ కుటుంబ సభ్యులతో మాట్లాడిన డిప్యూటీ సీఎం..ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రైతు ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు భట్టి.. రైతులెవరూ ఆత్మహత్య చేసుకోవద్దని సూచించారు. ప్రభాకర్ ఆత్మహత్యకు కారకులైనవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు భట్టి విక్రమార్క. ప్రభాకర్ భూమికి సంబంధించి శాశ్వతమైన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

# డ్రగ్స్ తీసుకుంటే కఠిన చర్యలు తప్పవు

- మొదటి పేజి తరువాయి

24 మందిలో ప్రముఖులు ఉన్నారన్నారు డీసీపీ. పబ్ లోని డీజేలతో కలిసి నిర్వాహకులు డ్రగ్స్ అమ్మినట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం పబ్ ఓనర్లు నలుగురు పరారీలో ఉన్నారు.. వారిపై కేసు బుక్ చేశామన్నారు డీసీపీ. అన్ని సాక్షాలు సేకరిస్తున్నాం.. డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి.. ఎవరు సప్లయ్ చేస్తు న్నారనే వివరాలు ఆరా తీస్తున్నామన్నారు. డ్రగ్స్ పై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తామన్నారు మాదాపూర్ డీసీపీ.. స్కూళ్ళు, కార్పొరేట్ సంస్థలు డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచిం చారు. డ్రగ్స్ అమ్మినా, వినియోగించిన కఠిన చర్యలు తప్పవన్నారు డీసీపీ. ది కేవ్ పబ్ మేనేజర్ శేఖర్ ను అదుపులోకి తీసుకున్నాం.. ఎన్ డీపీఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేశామన్నారు .. మత్తు పదార్థాలు బయటనుంచి తీసుకొని పబ్ లోకి ఎంటర్ అయ్యారని చెప్పారు. సోషల్ మీడియా లో ప్రచారం ద్వారా అందరూ పబ్ లో గాదర్ అయ్యారని అన్నారు. విచారణ అనంతరం పబ్ ను క్లోజ్ చేస్తామన్నారు. నగరంలో అన్ని పబ్ లను తనిఖీ చేస్తామన్నారు. అమెజాన్, టీసీఎస్ వంటి పెద్ద కంపెనీలు ఉద్యోగులకు డ్రగ్స్ పై అవగాహన కల్పించాలని మాదాపూర్ డీసీపీ వినీత్ సూచించారు. గతంలో కూడా ఈ పబ్ లీక్ తరహా పార్టీలు జరిగాయను అనుమానాలున్నాయన్నారు. పబ్ ఓనర్స్ ను అదుపులోకి తీసుకుంటే మరింత సమాచారం వస్తుందన్నారు. ప్రస్తుతం పబ్ నిర్వాహకులు నలుగురు పరారీల్లో ఉన్నారని మాదాపూర్ డీసీపీ చెప్పారు.

పోలీసుల రైడ్ లో మరికొంత మంది ప్రముఖులు దొరికారు. ఫొటోగ్రాఫర్ మహేష్ చంద్ర, ప్రముఖ అకౌంటెంట్ ఆదన్ చారి, అమెజాన్ సీనియర్ అసిస్టెంట్ ఎండీ షఫీ, అమెజాన్ కంపెనీలో సాఫ్ట్ ఎంప్లాయ్ కిరణ్ బాగానీ , ఎవరెస్ట్ మసాల వ్యాపార వేత్త మనీష్ గిరిధర్, అనిమేటర్ చింతం పూజిత్ , మ్యుజిషియన్ అబ్దుల్లా ఆయూబ్, బిజినెస్ మ్యాన్ మహ్మద్ రఫీ, అవంతి డిగ్రీ కాలేజీ విద్యార్థి సాయి ప్రనీత్, సాఫ్ట్ వేర్ ఇంజనీర్ కిరణ్ కుమార్, టీసీఎస్ ఎంప్లాయి సందీప్, బీఎఫ్ ఎక్స్ ఆర్టిస్ట్ పోతూరు వంశీకృష్ణ, బిజినెస్ మ్యాన్ ఎండీ రజా ఉన్నారు.

# అత్యంత ఘనంగా పూరీ జగన్నాథుడి రథోత్సవం...

- మొదటి పేజి తరువాయి

ఒకే రోజున పూరీ జగన్నాథుడి నవయవ్వన దర్శనం, నేత్రోత్సవం, రథయాత్ర చేపట్టారు.

ఇవాళ్టి ఘట్టానికి మరో విశిష్టత కూడా ఉంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పూరీ జగన్నాథస్వామి రథోత్సవానికి హాజరవడమే కాదు, రథం కూడా లాగారు. ఒడిశా గవర్నర్ రఘుబర్ దాస్ తో కలిసి ఆమె సుభద్ర దర్పళదస్ రథం లాగారు. ఓ భారత రాష్ట్రపతి పూరీ జగన్నాథ రథయాత్రకు హాజరు కావడం ఇదే ప్రథమం.

ఈ ఉత్సవానికి ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝి, పలువురు కేంద్ర మంత్రులు కూడా హాజరయ్యారు. కాగా, రథయాత్ర రేపు (జులై 8) కూడా కొనసాగనుంది.

# అధ్యక్ష బరిలో ఉండేది నేనే.. గెలిచేదీ నేనే

- మొదటి పేజి తరువాయి

లేరని వ్యాఖ్యానించారు. దేవుడు దిగి వచ్చి చెబితే తప్ప పోటీ నుంచి తప్పుకోబోనని తేల్చి చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసేదీ తానే.. ట్రంప్ ను మళ్లీ ఓడించేది తానేనని ధీమా వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం (అమెరికా కాలమానం) ఏబీసీ న్యూస్ టీవీకి ఇచ్చిన స్పెషల్ ఇంటర్వ్యూలో బైడెన్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 2020 ఎన్నికల సమయంలోనూ తాను ఓడిపోతానని ప్రచారం జరిగిందని గుర్తుచేశారు. అప్పుడు డొనాల్డ్ ట్రంప్ ను ఓడించి అధ్యక్ష బాధ్యతలను చేపట్టానని, ఇప్పుడు కూడా మరోసారి ట్రంప్ పై గెలుస్తానని చెప్పారు. మరో నాలుగేళ్ల పాటు అమెరికన్లకు సేవ చేసే సామర్థ్యం తనకు ఉందని వివరించారు.

తన ఆరోగ్యంపై జరుగుతున్న ప్రచారాన్ని, తన జ్ఞాపకశక్తి, మానసిక ఆరోగ్యంపై రిపబ్లికన్లు చేస్తున్న ఆరోపణలను కొట్టిపారేశారు. మానసికంగా, శారీరకంగా తాను ఫిట్ గా ఉన్నానని తేల్చి చెప్పారు. తనకు ఎలాంటి వైద్య పరీక్షలు అవసరంలేదన్నారు. రిపబ్లికన్ల ఆరోపణల నేపథ్యంలో బైడెన్ ఆరోగ్యంపై కొంతమంది ప్రజల్లో అనుమానం రేకెత్తిందని యాంకర్ చెబుతూ.. అలాంటి వారి సందేహాలను తొలగించేందుకు ప్రైవేటుగా వైద్య పరీక్షలు చేయించుకుని, ఫలితాలను ప్రజల ముందు ఉంచే ఆలోచన ఉందా అని అడిగారు. అయితే, అధ్యక్షుడిగా తీరిక లేని పనులతో ప్రతీరోజూ తనకు తానే టెస్టులు పెట్టుకుంటున్నానని, తనకు మరే ఇతర పరీక్షలూ అవసరంలేదని వివరించారు.

రిపబ్లికన్ అభ్యర్థి, మాజీ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ తో జరిగిన తొలి డిబేట్ లో తడబడడంపై బైడెన్ స్పందించారు. అదొక పీడకల అని, నిద్రలేమి, టైట్ షెడ్యూల్ కారణంగా చాలా అలసిపోవడం వల్ల డిబేట్ లో సరిగా పార్టిసిపేట్ చేయలేదని తెలిపారు. ఓవైపు డిబేట్ జరుగుతుండగానే నిద్ర ముంచుకొచ్చిందని, అందుకే ఇకపై రాత్రి 8 గంటల తర్వాత ఎలాంటి కార్యక్రమాలను
చేయొద్దని నిర్ణయించుకున్నట్లు వివరించారు. అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలంటూ సొంతపార్టీ నేతలే డిమాండ్ చేస్తున్నారన్న ప్రచారంపై స్పందిస్తూ.. పార్టీ సీనియర్ నేతలు ఎవరూ తనతో నేరుగా ఆ విషయాన్ని ప్రస్తావించలేదని బైడెన్ స్పష్టం చేశారు. అధ్యక్ష బాధ్యతల నిర్వహణకు తనకంటే మెరుగైన అభ్యర్థి లేరని కుండబద్దలు కొట్టారు. మరో నాలుగేళ్ల పాటు అమెరికన్లకు సేవలందించే శక్తి, సామర్థ్యాలు తనకున్నాయని వివరించారు.

# తెలంగాణ గ్రూప్ -1 ప్రిలిమ్స్ ఫలితాలు రిలీజ్

- మొదటి పేజి తరువాయి

ఉంచుంతాతని ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 9న గ్రూప్ వన్ ప్రిలిమినరీ పరీక్ష జరిగింది. ఎగ్జామ్ కు మొత్తం మూడు లక్షల 20వేల మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష పూర్తయ్యాక ప్రైమరీ కీ రిలీజ్ చేసిన టీజీపీఎస్సీ.. జూన్ 17లోపు అభ్యంతరాలు తెలపాలని సూచించింది. అభ్యర్థుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకున్న టీజీపీఎస్సీ బోర్డు.. ఇవాళ ఫైనల్ కీ రిలీజ్

# మెగా హీరో సాయితేజ్ కు కృతజ్ఞతలు తెలిపిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. ఎందుకంటే...!

## పిల్లల వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో పోస్టు చేయడంపై సాయితేజ్ ఆందోళన

### తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపు

### సోషల్ మీడియాలో పిల్లలపై వికృత ధోరణులకు అడ్డుకట్ట వేస్తామన్న భట్టి విక్రమార్క

**హైదరాబాద్ పెన్ పవర్:** తల్లిదండ్రులు తమ పిల్లల వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడంపై మెగా హీరో సాయి దుర్గా తేజ్ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ప్రపంచం క్రూరమైనదిగా, ప్రమాదకరంగా మారిపోయిందని తెలిపారు. అందుకే పిల్లలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే ముందు తల్లిదండ్రులు కొంత వివేకంతో ఆలోచించాలని సూచించారు. సోషల్ మీడియాలో కొందరు మృగాల వంటి మనుషులు ఉంటారని, వారిని కట్టడి చేయడం చాలా కష్టమని అభిప్రాయపడ్డారు. వినోదం పేరిట పిల్లల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్నారని... ఇది భయంకరం, అసహ్యకరం కంటే కూడా ఎక్కువ అని సాయితేజ్ పేర్కొన్నారు. ఇప్పుడు పిల్లల భద్రత అత్యంత ముఖ్యమని... సోషల్ మీడియాలో ఇలాంటి వికృత ధోరణులను అరికట్టేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గారు... ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారు, మంత్రి నారా లోకేశ్ గారు తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నానని తెలిపారు.
ఈ మేరకు ఓ చిన్నారి బాలికకు సంబంధించిన వీడియోను కూడా సాయితేజ్ పంచుకున్నారు. ఆ వీడియోపై కొందరు వ్యక్తులు ఆన్ లైన్ లో చాటింగ్ చేసిన విధానాన్ని సాయితేజ్ ప్రస్తావించారు.

దీనిపై తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పందించారు. ఎంతో కీలక సమస్యను ఎత్తిచూపినందుకు సాయితేజ్ కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని భట్టి విక్రమార్క సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. చిన్నారుల భద్రత ఎప్పటికీ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమేనని పేర్కొన్నారు.
సోషల్ మీడియా వేదికల్లో చిన్నారులపై వికృత ధోరణులు, వేధింపులను అరికట్టేందుకు తమ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. పిల్లలకు మరింత మెరుగైన ఆన్ లైన్ వాతావరణాన్ని అందించేందుకు మనం కలిసి పనిచేద్దాం అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.



# ప్రిలిమ్స్ ఫెయిలైన అభ్యర్థులు నిరుత్సాహపడొద్దు: సీఎం రేవంత్ రెడ్డి

### జూన్ 9న తెలంగాణలో గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహణ

### ఫలితాలు విడుదల చేసిన టీజీపీఎస్సీ

### మెయిన్ కు అర్హత సాధించిన వారికి శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాల విడుదలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. గ్రూప్-1 మెయిన్స్ కు అర్హత సాధించిన 31,382 మంది అభ్యర్థులకు శుభాకాంక్షలు అంటూ ట్వీట్ చేశారు. అక్టోబరు 21-27 మధ్య జరిగే మెయిన్స్ పరీక్షలో మీరు విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నా అని తెలిపారు. ఇక, ప్రిలిమ్స్ లో విజయం సాధించలేకపోయిన అభ్యర్థులు నిరుత్సాహపడొద్దని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, దానికోసం ప్రయత్నించడం, విజయం సాధించే వరకు ప్రయత్నాన్ని విరమించకపోవడాన్ని ఒక వ్యాపకంగా పెట్టుకున్నవారు ఎప్పటికైనా విజయతీరాలకు చేరతారని తన ట్వీట్ లో పేర్కొన్నారు. తెలంగాణలో జూన్ 9వ తేదీన గ్రూప్-1 ప్రిలిమ్స్ జరగడం తెలిసిందే. ఈ పరీక్షకు 3.20 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. మెయిన్స్ కు 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసినట్టు టీజీపీఎస్సీ ఇవాళ ఓ ప్రకటనలో వెల్లడించింది.

# ఏపీ సీఎం చంద్రబాబును కలిసేందుకు విఫలయత్నాలు చేసిన పీఎస్సార్ ఆంజనేయులు

### ప్రస్తుతం హైదరాబాదులో ఉన్న చంద్రబాబు


### చంద్రబాబు నివాసం వద్దకు రెండుసార్లు వచ్చిన ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్

### గేటు వద్ద నుంచే వెనక్కి పంపించిన భద్రతా సిబ్బంది



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులు వైసీపీ ప్రభుత్వ అనుకూల అధికారిగా ముద్రపడడం తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, ఎన్నికల విధుల్లో అవకతవకలకు పాల్పడ్డారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. ఈసీ ఆయనను విధుల నుంచి తప్పించినా, అనధికారికంగా కూడా వైసీపీ కోసం పనిచేశారన్న అప్రదిష్ఠ మూటగట్టుకున్నారు. ఈ నేపథ్యంలో, నేడు ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాదులో ఏపీ సీఎం చంద్రబాబును కలిసేందుకు పీఎస్సార్ ఆంజనేయులు విఫలయత్నాలు చేశారు. అపాయింట్ మెంట్ లేదని సీఎంవో కార్యాలయ అధికారులు చెప్పినప్పటికీ, చంద్రబాబును కలిసేందుకు రెండుసార్లు జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసం వద్దకు వచ్చారు. దాంతో, ఆయనను చంద్రబాబు భద్రతా సిబ్బంది గేటు వద్ద నుంచే వెనక్కి పంపించారు.

# పెద్దవాళ్లకు మాత్రమే సినిమాల కోసం 'పోర్న్ పాస్ పోర్ట్'.. ఎక్కడంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** పెద్దవాళ్లకు మాత్రమే.. 18 ఏళ్లలోపు పిల్లలు చూడొద్దంటూ పోర్న్ చూడడానికి ఎన్ని నిబంధనలు పెట్టినా ఉపయోగం లేకపోవడంతో స్పెయిన్ సరికొత్త ఆలోచన చేసింది. పోర్న్ సినిమాలు కేవలం పెద్దవాళ్లకు మాత్రమే అందుబాటులో ఉండేలా చూసేందుకు కొత్త మొబైల్ యాప్ ను తయారుచేసింది. పోర్న్ పాస్ పోర్ట్ గా వ్యవహరిస్తున్న ఈ యాప్ ను త్వరలో అందుబాటులోకి తీసుకురానుంది. ఈ యాప్ సాయంతో పిల్లలు పోర్న్ సినిమాలు చూడకుండా నియంత్రించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

**ఏంటీ పోర్న్ పాస్ పోర్ట్..?**

ఇదొక మొబైల్ యాప్. పద్దెనిమిదేళ్లు నిండిన వారు ఆన్ లైన్ లో పోర్న్ చూసేందుకు చట్టబద్ధంగా అవకాశం కల్పిస్తుంది. ఈ యాప్ లో లాగిన్ అయ్యేందుకు స్పెయిన్ ప్రభుత్వం జారీ చేసిన 5 ఐడీ కార్డుల్లో ఏదో ఒకటి అప్ లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ ఐడీలోని వయసు ఆధారంగా యూజర్ ఏజ్ కన్ఫర్మ్ చేసుకుని, పద్దెనిమిదేళ్లు పైబడిన వారికే యాక్సెస్ కల్పిస్తుంది. ఒకసారి లాగిన్ అయ్యాక యూజర్ ఐడీ జనరేట్ అవుతుంది. ఈ ఐడీకి నెలనెలా 30 పోర్న్ క్రెడిట్స్ జమ అవుతాయి. ఆన్ లైన్ లో పోర్న్ చూసేందుకు ఈ క్రెడిట్స్ ఉపయోగపడతాయి. ఈ క్రెడిట్స్ లేకుండా పోర్న్ చూడడం (ప్రభుత్వం నిర్దేశించిన వెబ్ సైట్లలో) సాధ్యం కాదు. పోర్న్ చూసే సమయాన్ని బట్టి క్రెడిట్స్ ఖర్చవుతుంటాయి. నెల పూర్తికాకముందే 30 క్రెడిట్స్ ఖర్చుపెట్టేస్తే.. అదనపు క్రెడిట్స్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ యాప్ ను తొందర్లోనే అమలులోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీనిద్వారా చిన్న పిల్లలు ఆన్ లైన్ లో పోర్న్ చూడకుండా కట్టడి చేయవచ్చని భావిస్తోంది.

**కట్టడి సాధ్యమేనా..**

ఆన్ లైన్ లో పోర్న్ సైట్లు కోకొల్లలుగా ఉన్నాయి. ప్రభుత్వ చట్టాల ప్రకారం మైనర్లకు తమ కంటెంట్ అందకుండా ఆయా సైట్లు జాగ్రత్తలు తీసుకుంటాయి. వయసు నిర్ధారణకు ఆయా సైట్లు తమకంటూ ప్రత్యేకంగా పద్ధతులను రూపొందించుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న యాప్ ను పోర్న్ సైట్లు ఆమోదిస్తాయా లేదా అనేది ప్రశ్నార్థకం. దీనిపైనే పోర్న్ పాస్ పోర్ట్ పనితీరు ఆధారపడి ఉందని టెక్ నిపుణులు చెబుతున్నారు.

# విజయవాడలో ఓ బంకులో పెట్రోల్ కు బదులు నీళ్లు... వాహనదారుల ఫైర్

### అజిత్ సింగ్ నగర్ లోని ఓ పెట్రోల్ బంకులో ఘటన

### వర్షపు నీరు పెట్రోల్ ట్యాంకులో కలిసిన వైనం

### నీళ్లు కలిసిన పెట్రోల్ తో వాహనదారుల ఇక్కట్లు

### కిలోమీటరు వెళ్లగానే మొరాయించిన వాహనాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** విజయవాడలోని ఓ పెట్రోల్ బంకులో విస్మయం కలిగించే పరిణామం చోటుచేసుకుంది. నగరంలోని అజిత్ సింగ్ నగర్ లో ఉన్న ఓ పెట్రోల్ బంకులో పెట్రోల్ కొట్టించుకుందామని వెళ్లిన వాహనదారులకు విచిత్రమైన అనుభవం ఎదురైంది. పెట్రోల్ కొట్టించుకున్న తర్వాత కొంతదూరం వెళ్లగానే వాహనాలు మొరాయిస్తున్నాయి.
దాంతో, వాహనదారులు మెకానిక్ లను ఆశ్రయించగా, పెట్రోల్ లో నీళ్లు కలిసిన విషయాన్ని మెకానిక్ లు గుర్తించారు. ఈ నేపథ్యంలో, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అజిత్ సింగ్ నగర్ లోని పెట్రోల్ బంక్ ఎదుట ఆందోళన చేపట్టారు. దీనిపై, బంకు యాజమాన్యం స్పందించింది. వర్షపు నీరు భూగర్భంలోని పెట్రోల్ ట్యాంకులో కలవడం వల్లే ఇలా జరిగిందని వివరణ ఇచ్చింది. నీళ్లు కలిసిన పెట్రోల్ కొట్టించుకున్న వినియోగదారులకు మళ్లీ పెట్రోల్ కొట్టిస్తామని, నీళ్లు కలవడం వల్ల పాడైన వాహనాలకు రిపేర్లు కూడా చేయిస్తామని ఆ పెట్రోల్ బంకు యాజమాన్యం హామీ ఇచ్చింది. దాంతో, వాహనదారులు శాంతించారు.

# టెన్నిస్ ఆటగాళ్లకు ఆన్ లైన్ వేధింపుల నుంచి రక్షణ... వింబుల్డన్ లో ఏఐ

### అన్ని రంగాల్లోనూ ఏఐ

### ఆటగాళ్ల ఆన్ లైన్ వాతావరణాన్ని సురక్షితం చేసేందుకు ఏఐ టూల్

### ఆటగాళ్ల సోషల్ మీడియా ఖాతాల్లో అసభ్య, అవమానకర కామెంట్లకు అడ్డుకట్ట



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇప్పుడు దాదాపు ప్రతి రంగంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాజ్యమేలుతోంది. క్రీడారంగంలోనూ ఏఐతో అనేక ఉపయోగాలు ఉన్నాయి. తాజాగా, ప్రతిష్ఠాత్మక టెన్నిస్ గ్రాండ్ స్లామ్ టోర్నీ వింబుల్డన్ లోనూ ఏఐ సేవలు వినియోగిస్తున్నారు. ఎలాగంటే... ఆటగాళ్లకు ఆన్ లైన్ వేధింపుల నుంచి రక్షణ కలిగించేందుకు కృత్రిమ మేధ సాయం తీసుకుంటున్నారు. టెన్నిస్ ఆటగాళ్ల సోషల్ మీడియా ఖాతాల్లో అసభ్య సందేశాలు, దూషణలు, వెక్కిరింతలు, అవమానకర వ్యాఖ్యలు, జాత్యహంకార వ్యాఖ్యలు, లైంగిక, ప్రాణహాని బెదిరింపులను ఏఐ టెక్నాలజీ సాయంతో అడ్డుకుంటారు. ఆటగాళ్ల ఖాతాలను ఈ ఏఐ టెక్నాలజీ నిరంతరం పర్యవేక్షిస్తుంటుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ప్రాచుర్యంలో ఉన్న 35 భాషలను వింబుల్డన్ ఏఐ టూల్ గుర్తించగలదు. వీటిలో ఏ భాషలో చెడు కామెంట్ చేసినా ఏఐ టూల్ వెంటనే ఫిల్టర్ చేస్తుంది. తద్వారా, వింబుల్డన్ లో ఆడే టెన్నిస్ ఆటగాళ్ల సోషల్ మీడియా ఖాతాల్లో మంచి కామెంట్లు చేయగలరేమో కానీ... చెడు కామెంట్లు చేయడం ఏమాత్రం కుదరని పని. ఇకపై టెన్నిస్ ఆటగాళ్ల ఆన్ లైన్ వాతావరణాన్ని కలుషితం చేయడం అసాధ్యమని వింబుల్డన్ నిర్వహించే ఆల్ ఇంగ్లాండ్ లాన్ టెన్నిస్ క్లబ్ పేర్కొంది. కాగా, వింబుల్డన్ లో ఉపయోగించే ఏఐ టూల్ ను యూఎస్ ఓపెన్ గ్రాండ్ స్లామ్ టోర్నీలోనూ వినియోగించనున్నారు.

# ఏపీ సీఎంగా తొలిసారి ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు చంద్రబాబు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు చేరుకున్నారు. జూబ్లీహిల్స్ లోని తన నివాసం నుంచి ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వరకు కార్యకర్తలతో భారీ ర్యాలీగా సాగారు. ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి ట్రస్ట్ భవన్ కు వచ్చిన చంద్రబాబుకు తెలంగాణ టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శనివారం భేటీ అయిన విషయం తెలిసిందే. అనంతరం జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో చంద్రబాబు విశ్రాంతి తీసుకున్నారు. ఆదివారం ఉదయం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు దారి పొడవునా జై తెలుగుదేశం, జై చంద్రబాబు అంటూ నినాదాలతో హోరెత్తించారు.
కార్యకర్తలు, అభిమానుల కేరింతల నడుమ చంద్రబాబు ఎన్టీఆర్ భవన్‌కు చేరుకున్నారు. ఏపీ సీఎం చంద్రబాబుకు మరికాసేపట్లో తెలంగాణ టీడీపీ నేతలు సన్మానం చేయనున్నారు.

# తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంపై వెంకయ్యనాయుడు స్పందన



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాదులో నిన్న తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమావేశం కావడంపై భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పందించారు. తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న విభజన అంశాల పరిష్కారమే లక్ష్యంగా ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ కావడం శుభపరిణామం అని అభివర్ణించారు. ఇది కీలక ముందడుగు అని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. ఏపీ, తెలంగాణ మధ్య అపరిష్కృత అంశాలపై వీలైనంత త్వరలో అంగీకారానికి వస్తారని ఆశిస్తున్నానని ట్వీట్ చేశారు.

# అభిషేక్ శర్మ విధ్వంసక సెంచరీ...

# 20 ఓవర్లలో 234 కొట్టిన టీమిండియా

## టీమిండియా, జింబాబ్వే మధ్య నేడు రెండో టీ20

## టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా

## 47 బంతుల్లో 100 పరుగులు చేసిన అభిషేక్ శర్మ

## విరుచుకుపడిన రుతురాజ్, రింకూ సింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** సన్ రైజర్స్ హైదరాబాద్ తరపున ఐపీఎల్ లో మెరుపులు మెరిపించిన యువ ఓపెనర్ అభిషేక్ శర్మ జింబాబ్వే పర్యటనలోనూ తన ఫామ్ కొనసాగిస్తున్నాడు. ఇవాళ టీమిండియా, జింబాబ్వే జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ లో అభిషేక్ శర్మ విధ్వంసక సెంచరీతో అలరించాడు. అభిషేక్ శర్మ సెంచరీ సాయంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లకు 234 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. నిన్న జరిగిన తొలి టీ20లో డకౌట్ అయిన అభిషేక్ శర్మ... ఇవాళ మాత్రం ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. జింబాబ్వే బౌలర్లను ఓ రేంజిలో ఉతికారేసిన అభిషేక్ శర్మ 47 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్సర్లతో సరిగ్గా 100 పరుగులు చేసి అవుటయ్యాడు. ఈ లెఫ్ట్ హ్యాండర్ నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడడంతో జింబాబ్వే బౌలర్లు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మరో ఎండ్ లో రుతురాజ్ గైక్వాడ్, రింకూ సింగ్ సైతం తగ్గేదే లే అంటూ విరుచుకుపడడంతో టీమిండియా స్కోరు 200 మార్కు దాటింది. రుతురాజ్ గైక్వాడ్ 47 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్ తో 77 పరుగులు చేసి అజేయంగా నిలవగా... రింకూ సింగ్ 22 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సులతో 48 పరుగులు చేసి నాటౌట్ నిలిచాడు. జింబాబ్వే బౌలర్లలో ముజరబాని 1, మసకద్జా 1 వికెట్ తీశారు. అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా... ఆరంభంలోనే తొలి వికెట్ కోల్పోయింది. కెప్టెన్ శుభ్ మాన్ గిల్ 2 పరుగులకే అవుటయ్యాడు. ఓ దశలో టీమిండియా తొలి పవర్ ప్లేలో తక్కువ పరుగులే చేసింది. 6 ఓవర్లలో టీమిండియా స్కోరు 1 వికెట్ నష్టానికి 36 పరుగులు. అక్కడి నుంచి టీమిండియా పరుగుల ప్రవాహం మొదలైంది. అభిషేక్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్ భారీ షాట్లతో జింబాబ్వే బౌలర్లను బెంబేలెత్తించారు. అభిషేక్ శర్మ సెంచరీ అనంతరం అవుటైనా... రుతురాజ్ కు రింకూ సింగ్ తోడవడంతో పరుగుల వెల్లువ కొనసాగింది.

# 'ద్రావిడ్' కు భారతరత్న ఇవ్వాలన్న భారత క్రికెట్ దిగ్గజం

**టీమిండియా టీ20 వరల్డ్ కప్ గెలవడం వెనుక రాహుల్ ద్రావిడ్ కృషి**

**భారతరత్నకు ద్రావిడ్ అన్ని విధాలా అర్హుడన్న గవాస్కర్**

**ద్రావిడ్ కు భారతరత్న... ఈ మాట వింటుంటేనే అద్భుతంగా ఉందని వెల్లడి**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా టీ20 వరల్డ్ కప్ గెలవడంతో కోచ్ రాహుల్ ద్రావిడ్ పేరు కూడా మార్మోగిపోతోంది. భారత క్రికెట్లో ఆణిముత్యం అనదగ్గ వ్యక్తి రాహుల్ ద్రావిడ్. 'ది వాల్' అనే బిరుదుకు న్యాయం చేస్తూ, ఎన్నోసార్లు వికెట్ల పతనానికి అడ్డుగోడలా నిలిచిన ద్రావిడ్... ఆటగాడిగా అనేక ఘనతలు సాధించాడు. వాటన్నింటినీ మించిపోయేలా కోచ్ గా వరల్డ్ కప్ ను సాధించి తన కెరీర్ ను చిరస్మరణీయం చేసుకున్నాడు. కాగా, ద్రావిడ్ కు భారతదేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వాలని క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ అంటున్నారు. భారతరత్నకు ద్రావిడ్ అన్ని విధాలా అర్హుడని గవాస్కర్ స్పష్టం చేశారు. ద్రావిడ్ కు భారతరత్న ఇవ్వడం సబబుగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. "కెప్టెన్ గానూ, ఆటగాడిగానూ ద్రావిడ్ ఎనలేని సేవలు అందించాడు... నేషనల్ క్రికెట్ అకాడమీ చైర్మన్ గా యువ ప్రతిభావంతులను ఎంతోమందిని తెరపైకి తెచ్చాడు... టీమిండియా కోచ్ గా అద్భుతమైన ఫలితాలు అందించాడు... కెరీర్ లోఎన్నడూ స్వార్థం చూపించలేదు. ద్రావిడ్ అన్ని వర్గాలను అలరించిన వ్యక్తి. రాహుల్ ద్రావిడ్ కు భారతరత్న... ఈ మాట వింటేనే అద్భుతంగా అనిపిస్తోంది. ద్రావిడ్ కు భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని అడుగుదాం... మీరు కూడా నాతో జత కలుస్తారని అనుకుంటున్నా" అంటూ గవాస్కర్ పేర్కొన్నారు.

# రోహిత్ శర్మ నాయకత్వంలో టీమిండియా ఆ రెండు కూడా గెలుస్తుంది: జై షా

**రోహిత్ శర్మ సారథ్యంలో టీ20 వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా**

**రాబోయే టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్, చాంపియన్స్ ట్రోఫీ కూడా గెలుస్తామన్న జై షా**

**రోహిత్ శర్మ నాయకత్వంపై తనకు నమ్మకం ఉందని వెల్లడి**



**హైదరాబాద్ పెన్ పవర్:** రోహిత్ శర్మ నాయకత్వంలోని టీమిండియా ఐసీసీ టీ20 వరల్డ్ కప్-2024ను కైవసం చేసుకోవడంపై బీసీసీఐ కార్యదర్శి జై షా స్పందించారు. రోహిత్ శర్మ కెప్టెన్సీ సంతృప్తికరంగా సాగుతోందని అన్నారు. రోహిత్ శర్మ సారథ్యంలో టీమిండియా రాబోయే వరల్డ్ టెస్ట్ చాంపియన్ షిప్ ఫైనల్లోనూ విజయం సాధిస్తుందని, అదే క్రమంలో చాంపియన్స్ ట్రోఫీలోనూ విజేతగా నిలుస్తుందని జై షా ధీమా వ్యక్తం చేశారు. "టీమిండియా టీ20 వరల్డ్ కప్-2024 ట్రోఫీని గెలుచుకుని బార్బడోస్ లో త్రివర్ణ పతాకాన్ని ఎగరవేస్తుందని నేను రాజ్ కోట్ లోనే చెప్పాను. రోహిత్ శర్మ అది నిజం చేసి చూపించాడు. టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో చివరి 5 ఓవర్లే నిర్ణయాత్మకంగా మారాయి. ఆఖరి ఓవర్లలో సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, హార్దిక్ పాండ్యా ప్రధాన పాత్ర పోషించారు. ఈ వరల్డ్ కప్ విజయం తర్వాత మా టార్గెట్ వరల్డ్ టెస్టు చాంపియన్ షిప్ ఫైనల్, ఆ తర్వాత చాంపియన్స్ ట్రోఫీ. ఈ రెండింటిలోనూ రోహిత్ శర్మ టీమిండియాను విజయపథంలో నడిపిస్తాడని నాకు గట్టి నమ్మకం ఉంది" అని జై షా వివరించారు. కాగా, టీ20 వరల్డ్ కప్ విజయాన్ని కోచ్ రాహుల్ ద్రావిడ్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజాలకు అంకితం ఇస్తున్నట్టు జై షా ప్రకటించారు.

# బీ-అలెర్ట్...చిరుతలా దూసుకొస్తుంది!

సాక్షి అగర్వాల్ చిక్ బ్లాక్ ఎన్‌సెంబుల్‌లో ఉష్ణోగ్రతలను పెంచుతుంది





ఇన్‌స్టాగ్రామ్‌లో అన్వేషి జైన్ అద్భుతమైన చిత్రాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** బీ -అలెర్ట్ చిరుతలా దూసుకొస్తున్న చిచ్చర పిడుగుతో తస్మాత్ జాగ్రత్త! అవును అతిలోక సుందరి తనయ జాన్వీకపూర్ ని చూస్తుంటే మిగతా భామలంతా అలెర్ట్ కావాల్సిందే అన్నంతగా సన్నివేశం కనిపిస్తుంది. అమ్మడు సరైన టైమ్ చూసుకుని టాలీవుడ్ లో 'దేవర'తో లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. పాన్ ఇండియాలో టాలీవుడ్ దూసుకుపోతున్న సమయంలో జాన్వీ ఎంట్రీ సర్వత్రా చర్చకు దారి తీస్తోంది. తొలి సినిమా రిలీజ్ కాక ముందే రామ్ చరణ్ సరసన ఛాన్స్ అందుకుంది.

బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తోన్న ఆర్ సీ -16 లోనూ అవకాశం అందుకుని మిగతా భామల గుండెల్లో రెళ్లు పరిగెట్టించేలా చేస్తుంది. అటు తారక్..ఇటు చరణ్ ఇద్దరి సరసన ఒకేసారి ఛాన్స్ అందుకోవడం అంటే ఆషామాషీనా? అందులోనూ అందమైన భామల నుంచి తీవ్రమైన పోటీ వాతావరణంలో ఇద్దరు సూపర్ స్టార్ల సరసన ఛాన్స్ అంటే? తనకి మాత్రం నల్లేరు మీద నడకలాంటిందే అనిపించింది. అలాగని జాన్వీ కపూర్ బాలీవుడ్ లో వీరప్రతాపం చూపించిందా? అంటే అదేం లేదు. నటిగా అక్కడా ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటుంది. బిజీ అవుతోన్న తరుణంలో టాలీవుడ్ లోనూ ఎంట్రీ ఇచ్చింది. మరి ఈ అవకాశాలు ఎలా సాధ్యమైంటే? మామ్ వేసిన పునాదితోనే ఇదంతా సాధ్యమవుతుంది. శ్రీదేవికి టాలీవుడ్ లో ఉన్న క్రేజ్ కారణంగానే ఇలా వరుసగా ఛాన్సులు ఒడిసిపట్టుకుంటుంది. వెనుక బోనీ కపూర్ కూడా చక్రం తిప్పడంతో కాపింటీషన్ నుంచి కొంత మంది భామలు ఎగ్జిట్ అవుతున్నారు.

దీంతో జాన్వీకి గేట్లు తెరుచుకుంటున్నాయి. జాన్వీ కమిట్ అయిన ఈ రెండు సినిమాలు గనుక సక్సెస్ అయితే ఆమె వేగాన్ని ఆపడం అసాధ్యమనే చెప్పాలి. హీరోలందర్నీ అమ్మడు రౌండప్ చేసేస్తుంది. కొత్త వాళ్లకు ఛాన్స్ ఇవ్వకుండా అన్నింటా నేనే అంటోంది. శ్రీలీల..రష్మిక మందన్న లాంటి ఫామ్లో ఉన్న ఫాలోయింగ్ భామల్ని సైతం జాన్వీ సైడేస్తుందని అప్పుడే గెస్సింగ్స్ తెరపైకి వస్తున్నాయి. ఏది ఏమైనా అంతిమంగా నిలబెట్టేది సక్సెస్ ఒక్కటే అన్నది అంతా గుర్తుంచుకోవాల్సి విషయం.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com